

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 236 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం, 26, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# అంతిమ విజయం.. ఆదర్శం!

- భారతదేశం గర్వించిన ఉద్యమం ఇది
- కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా
- కోట్లాది రక్త బిందువులతో కొట్లాడి తెచ్చుకున్న విజయం
- సీజెపి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజిత్ దీప్కే చరిత్ర సృష్టించాడు
- విద్యావేత్త సోనమ్ వాంగ్చుక్ ఆదర్శవంతులు
- సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి మాటలతో దేశం కదిలింది
- ఇతర దేశాలపై విరుచుకుపడి తోకముడిచారు
- దేశ ఆర్థిక శాఖ మంత్రి మాటలు అసహ్యంగా ఉన్నాయి
- ప్రశ్నాపత్రాల లీకులతో విద్యార్థులకు లాభమా నష్టమా
- ఇప్పటికీ బుద్ధి మార్చుకొని బీజేపి నేతలు
- ఉద్యమ బాటలో విజయం వరించిన తీరు అమోఘం
- కేంద్ర పోలీస్ బలగాలు విద్యార్థులను చిత్రవధకు గురి చేశారు
- డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

పోరాడి తెచ్చుకున్న విజయంలో ఎంతో గర్వందాగి ఉంటుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. అంచలంచలుగా పెరిగిన ఉద్యమం ఆకాశమంత విజయాన్ని చేకూర్చి పెట్టిందని వివరించారు. విద్యార్థుల పోరాటాలకు దాసోహమైన కేంద్ర ప్రభుత్వం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయించారని ఇదంతా విద్యార్థుల పోరాటాల వల్ల మాత్రమే సాధ్యమైందని తెలిపారు. విద్యార్థులు దేశ భవిష్యత్తును కాపాడగలిగినారని గర్వపడ్డారు. 12 సంవత్సరాల బిజెపి పరిపాలనలో ఎన్ని పోరాటాలు జరిగిన ఎన్ని ఉద్యమాలు జరిగిన కేంద్ర మంత్రుల స్పందన కరువైందని కాక్రోచ్ జనత పార్టీ ప్రారంభించిన ఉద్యమంతో దేశం మొత్తం కదిలి వచ్చిందని గుర్తుకు చేశారు. విద్యార్థి మేధావులు ఎంతటి అణచివేతను ఎదుర్కొన్నారో అంతటి ఘనవిజయాన్ని సాధించగలిగినారని విద్యార్థుల పోరాటాలను కొనియాడారు. ఉద్యమం ప్రారంభమైనది మొదలుకొని

- మిగతా 2లో..




డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## విద్యార్థుల విజయమే: సీజేపీ

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సంతోషం వ్యక్తం చేసిన సీజేపీ
ప్రధాన డిమాండ్ నెరవేరిందన్న అభిజీత్ దీప్కే
జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల సంబరాలు, కొవ్వొత్తుల ర్యాలీ
మరో రెండు డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగింపు
పోలీసుల చర్యలపై విచారణ, విద్యా సంస్కరణలకు డిమాండ్



4

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

నీట్ పేపర్ లీక్ వివాదంతో పదవికి వీడ్కోలు
విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కీలక నిర్ణయం
ప్రధాని మోదీకి రాజీనామా లేఖ పంపిన మంత్రి
విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
కేంద్రం-సీజేపీ చర్చలకు ముందే కీలక పరిణామం



6

## ఇందిరమ్మ టవర్స్ దరఖాస్తులపై సందేహాలకు ప్రత్యేక హెల్ప్‌లైన్

హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
యూపీఐ ద్వారానే ఈఎండీ చెల్లింపు..
ఇల్లు రాకపోతే పూర్తి మొత్తం తిరిగి చెల్లింపు



2

## “మనం సాధించాం”.. ఆనందంలో అభిజీత్ దీప్కే

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్తతో జంతర్‌మంతర్‌లో సంబరాలు
విద్యార్థుల పోరాటానికి తొలి విజయమన్న సీజేపీ వ్యవస్థాపకుడు
We Have Done It అంటూ నినదించిన అభిజీత్ దీప్కే
నెల రోజుల ఉద్యమానికి ఫలితం దక్కిందన్న విద్యార్థులు
పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందన్న స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జూలై 25 (జై భీమ్ న్యూస్):**



నీట్ పరీక్షల వివాదంపై నెల రోజులకు పైగా కొనసాగుతున్న విద్యార్థుల ఉద్యమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారన్న వార్త వెలువడగానే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకారుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఫోన్ ద్వారా రాజీనామా సమాచారం అందడంతో ఆయన వెంటనే మైక్ అందుకుని “మనం సాధించాం... We Have Done It అంటూ నినదించారు. దీంతో అక్కడున్న విద్యార్థులు, కార్యకర్తలు హర్షధ్వానాలు చేస్తూ ఒకరినొకరు అభినందించుకున్నారు. నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల నిర్వహణలో లోపాలు, విద్యార్థుల ఆత్మహత్యలపై గత కొన్ని వారాలుగా సీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులు జంతర్‌మంతర్ వద్ద దీక్ష కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వం ఉద్యమ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మంత్రి రాజీనామాకు అంగీకరించినట్లు ఆందోళనకారులు పేర్కొన్నారు. అయితే ఇది తమ పోరాటంలో తొలి విజయం మాత్రమేనని, సంపూర్ణ విజయం కాదని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. 21 మంది విద్యార్థుల మరణాలకు న్యాయం జరగాలని, పరీక్షల వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అమలు చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. మంత్రి రాజీనామా విద్యార్థుల పోరాటానికి నైతిక విజయంగా నిలిచిందని, విద్యావ్యవస్థలో పూర్తి స్థాయి మార్పులు వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదని విద్యార్థి సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# అంతిమ విజయం ఆదర్శం

మొదటి పేజీ తరువాయి

చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ఉద్యమస్ఫూర్తిని కనపరిచిన తీరు అమోఘమన్నారు.కేంద్ర ప్రభుత్వం ఎంత శక్తివంతమైనదో అంత బలహీన పడిందని విద్యాశాఖ మంత్రి రాజీనామాతో రుజువైపోయిందన్నారు.దేశంలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేని సంస్థను నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల చరిత్ర కలిగి ఉండగా భారతదేశానికి స్వాతంత్ర్యం రాకమునుపే 21 సంవత్సరాల క్రితం నిర్మానించబడగా అప్పటి భారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటీష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరించి స్వాతంత్ర్య పోరాటాలను భారతదేశ ఏర్పాటును క్షేత్రస్థాయిలో అడ్డుకున్నారని బ్రిటీష్ పాలకులకు మొట్టమొదట తొత్తులుగా పనిచేసిన వ్యక్తులు నేడు భారతదేశాన్ని పరిపాలించే స్థాయిలో భాగస్తులు అయిపోయారని అలాంటి సంస్థలో కెళ్ళి పుట్టుకొచ్చిన నాయకులే నేడు దేశ పాలకులన్న సంగతి భారత దేశ ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు.దేశాన్ని పాలిస్తున్న ప్రధానమంత్రి కేంద్ర మంత్రుల్లో ప్రతి ఒక్కరూ ఆర్ఎస్ఎస్ సంస్థ సభ్యులు అని ప్రస్తుత ఉపరాష్ట్రపతితో పాటు పాటు ప్రధాన నేతలందరూ ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులైనందునే పోరాటాలు చేస్తున్న విద్యార్థులపై ఇంతటి కర్కశమైన దాడులు చేయించారని నిందించారు.సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి వాక్యాలతో దేశంలో యువత మొత్తం ఒక్కసారిగా చెలంచిపోయారని ఢిల్లీ జంతర్ మంతర్ ధర్నాకు దేశ యువత మొత్తం కదిలి వచ్చారని ఎటు దిక్కుతోచని పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి దేశ యువత డిమాండ్లను నెరవేర్చిందని దాని పర్యావ స్థానం వల్ల దేశ భవిష్యత్తును దేశ యువత సాధించుకున్నారని పేర్కొన్నారు.

### అసలైన దేశద్రోహులు ఎవరు..

దేశంలో విద్యార్థులు చేయుచున్న ఉద్యమాల పట్ల ప్రతి రాష్ట్రంలోని బిజెపి నేతలు ఢిల్లీలో జరుగుతున్న జంజీల ఉద్యమానికి పాకిస్తానీయులు, బంగ్లాదేశీయులు,నేపాలీలు ఇలా ప్రస్తావిస్తూ పోగా ముస్లిం దేశాలన్నీ సహకరిస్తున్నాయని ఉద్యమానికి ధన సమీకరణ చేకూరుస్తున్నారని దిక్కుమాలిన ప్రచారాలన్నీ చేసిన బిజెపి మేధావులు కేంద్ర ప్రభుత్వం అవలంబించిన విధానాలను చూసి దిగ్గుతో తలదించుకున్నారంటూ హెచ్చరించారు.స్వయంగా కేంద్ర మంత్రులే విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి ఇతర దేశాల నుండి నిధులు సమీకరించబడలేదని అదే తరుణంలో విద్యార్థులు చేస్తున్న ఉద్యమాలకు ఇతర దేశాల సహకారం లేదని అట్టి ఉద్యమం పూర్తిగా దేశ పరిధిలో సంభవించిన పరిస్థితులను బట్టి మాత్రమే కొనసాగిందని తేల్చి చెప్పడం వల్ల విద్యార్థుల ఉద్యమాలపై అసత్య ప్రచారాలు చేసిన వ్యక్తులు,రాజకీయ వ్యక్తులు దిగ్గుతో తలదించుకోవాలని హెచ్చరించారు.దేశంలో నీట్ ప్రశ్నాపత్రాల లీకులలో ఇతర దేశాల ప్రధానమంత్రులు, కేంద్ర మంత్రులు,ముస్లిం దేశాల ప్రతినిధులది గాని ఎలాంటి పాత్ర లేదని కేవలం బిజెపి నాయకులు కుట్రల వల్లే నీట్ ప్రశ్న పత్రం లీక్ అయిందన్న సంగతిని స్వయంగా కేంద్ర మంత్రులు ఒప్పుకోవడం వల్ల ఆకాస్తైన పరువు కాపాడుకోగలిగినారని గుర్తు చేశారు.ఉద్యమ తీవ్రత పెరిగిన కొద్దీ సరిగ్గా నేపాల్ పరిస్థితిలో తలపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిగి రావడం ఉద్యమ తీవ్రత తగ్గిందని లేదంటే నేపాల్ పరిస్థితులు దేశంలో పునరావృతం అయ్యేవని తెలిపారు.నీట్ ప్రశ్న పత్రం లీకేజీలో ఇతర దేశాల పాత్ర లేనప్పుడు ఉద్యమ తీవ్రతలో ఇతర దేశాల పాత్ర లేనప్పుడు ఉద్యమాలను తక్కుదారి పట్టిస్తూ ఆర్ఎస్ఎస్ మూకలతో దాడులు చేయించగా 34 రోజుల పాటు జరిగిన మేధావుల ఉద్యమాల్లో లాఠీ దెబ్బలతో రక్తాలు కార్చిన విద్యార్థులు, లాఠీ చార్జీల ముసుగులో అసాంఘిక శక్తులను పోగుచేసుకొని దాడులు చేయించిన వ్యక్తులు ఎవరో దేశ ప్రజలు పసిగట్టాలన్నారు.ఇతర దేశాలపై అభండాలు వేస్తూ నిందలు వేస్తూ,విద్యార్థులను దాడులు చేస్తూ ఉద్యమాన్ని అణిచివేసి సుప్రీంకోర్టు న్యాయమూర్తితో ఉద్యమాలు చేస్తున్న విద్యార్థులపైనిందలు వేయించిన పెద్ద మనుషులు ఎవరో దేశ ప్రజలకు తెలుసునన్నారు.నిజాయితీగా ఉద్యమించిన విద్యార్థులను దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేసిన ప్రతి వ్యక్తి దేశద్రోహి అంటూ తీవ్రంగా హెచ్చరించారు.దేశాన్ని కాపాడుకోలేని అసాంఘిక శక్తులు సోషల్ మీడియాను ప్రధాన మీడియాను అడ్డం పెట్టుకొని విద్యార్థుల ఉద్యమాలను వక్రీకరిస్తూ వ్యతిరేక కోణంలో కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారాలు చేస్తున్నారని అలా ప్రచారాలు చేసిన ప్రతి ఒక్కరు దేశద్రోహులేనంటూ ఈ సందర్భంగా హెచ్చరించారు.నిజమైన జాతీయ భావం కలిగిన ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని నిలదీశారని జాతీయ వాదానికి దేశ ఆత్మ గౌరవానికి వ్యతిరేకంగా పావులు కలిపిన ప్రతి ఒక్కరు దేశద్రోహులేనంటు హెచ్చరించారు.దేశంపై కపట ప్రేమ చూపిస్తూ దేశ ప్రజలను మోసగిస్తున్న ప్రతి నాయకుడు దేశద్రోహేనంటూ హెచ్చరించారు.దేశ ప్రజలారా దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగాలు చేసుకుంటున్నా విద్యార్థి మేధావులను దేశద్రోహులుగా చిత్రీకరించే కుట్రలు పన్నిన ప్రతి ఒక్కరిని నిజమైన దేశద్రోహులుగా పరిగణించాలంటూ పిలుపునిచ్చారు.

### విద్యా భవిష్యత్తుపై విద్యార్థుల పోరాటం..

ఇతర దేశాలతో పోల్చి చూస్తే భారత దేశంలో ఉద్యమాలు అంత త్వరగా విజయాన్ని ఇవ్వవని తెలిపారు.దేశ యువత కులమతాలకు దూరంగా ఉండాలని హిందూ ముస్లిం రాజకీయాలకు మరింత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.మత రాజకీయాలను పక్కనపెట్టి కేవలం దేశ ప్రజల భవిష్యత్తు కోసం దేశ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయగలిగినప్పుడు మాత్రమే దేశంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని అలాంటి పోరాటాలు నిరంతరంగా కొనసాగడం వల్ల దేశంలో ఎంతటి పీఠమైన ఎంతటి సింహాసనమైనా కదిలించబడక తప్పవన్నారు.అభిజిత్ దీప్కే చేసిన పోరాటం ఇంచుమించు యుద్ధతీవ్రతను తలపించిందని తెలియజేస్తూ దేశంలో విద్యా హక్కులను కాపాడుకోవడం కోసం విద్యార్థులు వాళ్లకు వాళ్ళు స్వతహాగా పోరాటాలకు సిద్ధపడ్డారని ఇకపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిన యువత పరిపూర్ణమైన విశ్వాసంతో కేంద్ర ప్రభుత్వంపై యుద్ధ పోరాటాలకు సిద్ధమవుతారన్న సంగతిని ఉద్యమ తీవ్రత ద్వారా గుర్తు చేశారన్నారు.ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటాలు చేసిన విద్యార్థులను చూసి ఎంతో గర్వపడుతున్నామన్నారు.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశ ప్రజల భవిష్యత్తును ప్రశ్నార్థకంలో పడవేసి విద్యార్థులు చేస్తున్న ఉద్యమంపై అపహాస్యంగా మాట్లాడడం వల్ల మాత్రమే దేశంలో ఉద్యమ తీవ్రత ఎంతో స్థాయికి చేరిందని చివరకు ప్రభుత్వం తలదించుకునే పరిస్థితిలు ఏర్పడినాయని కేంద్ర మంత్రులు మాట్లాడిన మాటలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడిన మాటలకు ఎంతో వ్యత్యాసం ఉందని విమర్శలతో మొదలైన ఉద్యమాలు విజయాలను వరించేలా చేశాయని అంతటి ఉద్యమ తీవ్రతను కొనసాగించిన విద్యార్థి మేధావులు దేశంలో కేంద్ర ప్రభుత్వం స్థానం ఏమిటో దేశ ప్రజలకు గుర్తు చేశారని తెలిపారు.త్వరలో ఈవీఎంల ఎన్నికలపై మరో రకమైన ఉద్యమం జరగబోతుందని జాతీయ ఎన్నికల విధానంలో జాతీయ ఎన్నికల కమిషనర్ తలపెడుతున్న ఎన్నికల నిర్వహణ పట్ల దేశ ప్రజలు ఎంతో ఆక్రోషంగాను నిరుత్సాహంగాను ఉన్నారని ఇకపై దేశంలో ఏం జరిగినా రెప్పపాటులో ఉద్యమాలకు సిద్ధపడతారని కేంద్ర ప్రభుత్వం లో భయాందోళనలు మొదలయ్యాయని అన్నారు.24 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన సోనమ్ వాంగ్చుక్ దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షితులయ్యారని కొనియాడారు.34 రోజులు ఢిల్లీలోని జంతర్మంతర్లో జరిగిన ఉద్యమానికి ప్రత్యక్షంగాను పరోక్షంగాను సహకారం తెలిపిన దేశ యువతకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ఎన్ని అవమానాలనైనా ఎన్ని ఇబ్బందులు నైనా ఎన్ని శ్రమల నైనా కొన్ని దాడులనైన ఎదుర్కొని నిలబడగల శక్తి కేవలం నిజాయితీపరులైన ఉద్యమకారులకు మాత్రమే ఉంటుందని అలాంటి ఉద్యమకారులు తలపెట్టే ప్రతి ఉద్యమం రెట్టించిన విశ్వాసంతో అభివృద్ధి చెంది ఆత్మగౌరవాన్ని కాపాడుకోగలిగే విజయాలను వరింపజేస్తుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామాతో రుజువైందన్నారు.ఇకపై దేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన కాక్రోచ్ జనతా పార్టీతో పాటు దేశ యువత కదం తొక్కుతారని గుర్తుకు చేశారు.విద్యార్థుల పోరాటాలు ఎంతో బలమైన శక్తిని సమీకరిస్తాయో నేటి ఉద్యమ ఫలితం,నేటి ఉద్యమ విజయం నిరూపించిందన్నారు.

# విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగదు





**పేపర్ లీకేజీలపై కేంద్రం బాధ్యత వహించాలి**

**విద్యార్థులపై లాఠీచార్జీలు కాదు, భవిష్యత్తుకు భరోసా కల్పించాలి**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హనుమకొండ, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

నీట్, సీబీఎస్ఈ పరీక్షల పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, బాధ్యులపై చర్యలు తీసుకుని విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. నీట్, సీబీఎస్ఈ పరీక్షల్లో చోటుచేసుకున్న అక్రమాలను నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన విజయయాత్ర, క్యాండిల్‌లైట్ ర్యాలీలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పర్కాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ జంక్షన్ వరకు కొనసాగింది. చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జరిగిన 152 పేపర్ లీకేజీలు చిన్న విషయం కాదని, ఇది లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసిన అత్యంత తీవ్రమైన అంశమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఘటనలకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, వారికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థుల మరణాలు దేశంలో సాధారణ ఘటనలుగా మారడం అత్యంత బాధాకరమని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీలు చేయడం, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. విద్యార్థులను అణచివేయడం కాకుండా వారి సమస్యలను పరిష్కరించి, భవిష్యత్తుపై భరోసా కల్పించే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ నాయకులు పేపర్ లీకేజీలను తేలికగా తీసుకునే విధంగా మాట్లాడడం బాధ్యతారాహిత్యమని విమర్శించిన ఆయన, తప్పును అంగీకరించి విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పేపర్ లీకేజీ అంశం ఒక్క రాజీనామాతో ముగిసిపోదని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల విశ్వాసాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. మృతిచెందిన విద్యార్థులకు నివాళులర్పించడంతో పాటు వారి కుటుంబాలకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ, డీసీసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాయిని విశాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా అంధుల పాఠశాలలో సేవా కార్యక్రమం







**హనుమకొండ, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**


వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుమారుడు స్వర్గీయ నాయిని విశాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని లోహి ఆదర్శ అంధుల పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ నేహాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేహాల్ మాట్లాడుతూ, స్వర్గీయ నాయిని విశాల్ రెడ్డి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆయన ఆశయాలను స్మరించుకోవడం జరుగుతుందని అన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలే నిజమైన నివాళిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దీపక్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ టవర్స్ దరఖాస్తులపై సందేహాలకు ప్రత్యేక హెల్ప్‌లైన్

**హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**యూపీఐ ద్వారానే ఈఎండీ చెల్లింపు..**

**ఇల్లు రాకపోతే పూర్తి మొత్తం తిరిగి చెల్లింపు**



**హైదరాబాద్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్ నగరంలోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజలకు సమగ్ర సమాచారం అందించేందుకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార--పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కాల్‌సెంటర్ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు కార్యాలయంలో శనివారం ఈ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ, దరఖాస్తు విధానం, అర్హతలు, చెల్లింపులు, లాటరీ విధానం, ఫ్లాట్ల కేటాయింపు తదితర అంశాలపై ప్రజలకు అధికారిక సమాచారం అందించేందుకు ఈ సేవను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తులను నమ్మకుండా 040-24603572 నంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. క్యూర్ పరిధిలో లక్ష ఫ్లాట్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని, ఆ నియోజకవర్గానికి చెందిన అర్హులు అక్కడికే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను మీసేవ కేంద్రాలు, అధికారిక ఆన్‌లైన్ పోర్టల్, వాట్సాప్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో ఆధార్ నంబర్ ఒక్కటే సరిపోతుందని, కులం, ఆదాయం తదితర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. అవి లాటరీ అనంతరం ధ్రువీకరణ సమయంలో సమర్పిస్తే సరిపోతుందని వివరించారు. క్యూర్ పరిధిలో కనీసం పదేళ్లుగా నివసిస్తున్న వారు మాత్రమే ఈ పథకానికి అర్హులని, కుటుంబ వార్షిక ఆదాయం ఆరు లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తుదారుడు లేదా కుటుంబ సభ్యుల పేరిట క్యూర్ లేదా ఓఆర్ఆర్ పరిధిలో ఇల్లు, ఫ్లాట్ లేదా స్థలం ఉండకూడదని స్పష్టం చేశారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించి, ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయిస్తామని చెప్పారు. దరఖాస్తు సమయంలో పది వేల రూపాయల ఈఎండీని యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాలని, ఇతర చెల్లింపు విధానాలు అనుమతించబోమన్నారు. ఒకవేళ ఫ్లాట్ కేటాయించబడకపోతే చెల్లించిన మొత్తం అదే బ్యాంకు ఖాతాకు తిరిగి జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం కింద నిర్మించే ప్రతి ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో నిర్మించబడుతుందని తెలిపారు. ఒక్కో ఫ్లాట్ విలువ 40 లక్షల నుంచి 60 లక్షల రూపాయల వరకు ఉండగా, ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల సబ్సిడీతో పాటు 20 నుంచి 25 గజాల అవిభాజ్య స్థల హక్కును లబ్ధిదారుడి పేరుపై నమోదు చేస్తుందని మంత్రి వెల్లడించారు. లబ్ధిదారుడు కేవలం ఆరు లక్షల రూపాయలు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి.పి. గౌతమ్, హౌసింగ్ బోర్డు చీఫ్ ఇంజినీర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా 'సర్' ప్రక్రియ నిర్వహించాలి






### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**కేయూ క్యాంపస్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఫూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో నిర్వహించిన 'సర్' ప్రక్రియపై సెమినార్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, చైతన్యవంతమైన తెలంగాణలో ఇతర రాష్ట్రాల మాదిరిగా ఓటర్ల తొలగింపు కుట్రలు విజయవంతం కావని అన్నారు. ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కొంత మందగించినప్పటికీ, తన నియోజకవర్గంలో బీఎల్ఓలు, బీఎల్ఏల సహకారంతో ఇప్పటికే 58 శాతం ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. మిగిలిన వారం రోజుల్లో దానిని 80 శాతానికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ సర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థులు, మేధావులు, పౌర సమాజ ప్రతినిధులు కలిసి ఈ ప్రక్రియ విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇఫ్లూ ప్రొఫెసర్ డాక్టర్ రాజారాం మాట్లాడుతూ, ఆగస్టు 3వ తేదీ వరకు సర్ ప్రక్రియ కొనసాగుతుందని, ఆగస్టు 8న ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్ నోటిఫికేషన్) విడుదల కానుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని, రెండో విడతలో ఆరు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో కూడా సర్ అమలు జరుగుతోందని వివరించారు. తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ, సర్ ఫారంలో ఉన్న సంక్లిష్టతలను తొలగించాలని సూచించారు. యువత, పౌర సమాజం బాధ్యతగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ, సర్ ప్రక్రియపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత వచ్చే అభ్యంతరాల పరిష్కారంలో కూడా మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ అధ్యాపకులు డాక్టర్ యాదగిరి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య బలోపేతానికి సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేయూ మాజీ రిజిస్ట్రార్ సదానందం, డాక్టర్ కూరపాటి రమేష్, పాస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు బాబు యాదవ్, దామెర ఉపేందర్, రాజ్ మహమ్మద్, డాక్టర్ తాడూరి శాస్త్రి, గొడిశాల సత్యనారాయణ గౌడ్, డాక్టర్ నల్లారి శ్రీనివాస్, కంజర్ల నరసింహారాములు, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ సంపత్ కుమార్, డి. రామాచారి, డాక్టర్ మోటె చిరంజీవి, సురేందర్, శ్రవణ్ తదితరులు, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థి, యువజన పోరాటాల ఫలితమే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా - ఏఐఎఫ్‌డీఎస్

**హైదరాబాద్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు చేపట్టిన నిరంతర ఉద్యమాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత నెల రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల్లో జరిగిన అవకతవకలపై విద్యార్థులు, యువజన సంఘాలు చేపట్టిన ఆందోళనలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చాయని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం విద్యార్థి ఉద్యమానికి దక్కిన విజయంగా అభివర్ణించారు. గత పన్నెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఈ పరిణామం గట్టి ఎదురుదెబ్బగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన ఉద్యమం, వివిధ విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు నిర్వహించిన పోరాటాలు ఈ విజయానికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. మంత్రి రాజీనామాతో సమస్య పూర్తిగా పరిష్కారమైనట్లు కాదని, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటనల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంటున్న 21 మంది విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువజనులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని, ప్రజా ఉద్యమాలపై నల్లచట్టాల వినియోగాన్ని నిలిపివేయాలని కోరారు. దేశ విద్యారంగ పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేసిన విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, ఉద్యమానికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఏఐఎఫ్‌డీఎస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలియజేస్తోందని గడ్డం నాగార్జున పేర్కొన్నారు.



# విద్యార్థి ఉద్యమాల విజయమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా - ఎస్ఎఫ్ఐ







### నీట్ బాధిత విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి. ఎన్‌టీఏను రద్దు చేయాలి ఎస్ఎఫ్ఐ డిమాండ్

**కేయూ క్యాంపస్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

దేశవ్యాప్తంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరంతర ఉద్యమాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కేంద్ర మంత్రి రాజీనామా చేసిన నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం మొదటి గేటు వద్ద ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే ప్రభుత్వాలకు ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలే తగిన సమాధానమని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు రాజీలేని పోరాటం చేయడం వల్లే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని పేర్కొన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, బాధిత విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావడంతో పాటు ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ పరీక్షల నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న లినేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లిను రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై దేశంలో ఎక్కడా పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు చెన్నూరి సాయికుమార్, నాయకులు బిరెడ్డి జశ్వంత్, రాహుల్, రణదీప్, వివేక్, అభిషేక్, అనుఫ్, పవన్ కుమార్, సందీప్, అరుణ్, శివ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మెయిన్ రోడ్ కూడళ్లలో పైప్‌లైన్ లీకేజీలు, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి: సీపీఎం



**హనుమకొండ, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ నగరంలోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లలో పైప్‌లైన్ లీకేజీల కారణంగా రోడ్లపై నిలిచిపోతున్న కాలుష్య మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. శనివారం హనుమకొండ సౌత్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా స్థానిక సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా 30వ డివిజన్ పరిధిలోని పబ్లిక్ గార్డెన్, వాటర్ ట్యాంక్, గ్రంథాలయం, బస్టాండ్, బాలసముద్రం ప్రాంతాలను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్, మంద సంపత్ మాట్లాడుతూ, ప్రతి వర్షాకాలంలో బాలసముద్రం మెయిన్ కూడలి వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లేబర్ అడ్డాగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో ప్రతిరోజూ వందలాది మంది కార్మికులు ఉపాధి కోసం చేరుతారని, వర్షం కురిసిన ప్రతిసారి నీరు నిలిచి రాకపోకలకు ఆటంకం కలుగుతోందన్నారు. పైప్‌లైన్ లీకేజీలు, దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థ కారణంగా మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన, దోమల వ్యాప్తికి కారణమవుతోందని, ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యపై పలుమార్లు జీడబ్ల్యూఎంసీ అధికారులకు, కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రజల సమస్యల పట్ల పాలకవర్గాలు, సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడి, పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు వర్షపు నీరు, మురుగునీరు నిల్వ కాకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు మంద మల్లేశం, సౌత్ మండల కమిటీ సభ్యులు ఇస్లావత్ రవీందర్, జగనాల ఉప్పలయ్య, దూడపాక రాజేందర్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా స్వాగతిస్తున్నాము

### బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్

**హైదరాబాద్, 25జూలై 2026 (జై భీమ్ న్యూస్)**




నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ తెలిపారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మంత్రి రాజీనామాతో మాత్రమే వ్యవహారం ముగిసిపోకూడదన్నారు. ఢిల్లీలో నీట్ పరీక్ష అవకతవకలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, నిరసనకారులపై లాఠీచార్జ్ చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్‌తో పాటు ఇతర పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు సరైన బాధ్యత వహించలేదని ఆయన విమర్శించారు. ఈ పరిణామం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా నిలిచిందని పేర్కొన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విద్యార్థుల ప్రయోజనాల కోసం ఉద్యమించిన విద్యార్థి సంఘాలు, అలాగే దేశవ్యాప్తంగా పోరాటం చేసిన యువత అభినందనీయులని ఇబ్రాం శేఖర్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# పీహెచ్‌డీ పూర్తి చేసిన డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు ఘన సన్మానం

**కేయూ క్యాంపస్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో పార్ట్‌టైమ్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్ ఇటీవల పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డా. కిరణ్ కుమార్ గౌడ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఆయన విద్యా, పరిశోధనా రంగాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డా. పి. భాస్కర్, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎస్. కుమారస్వామి, అధ్యాపకులు డా. జేత్య, అన్వేష్, పల్లవి, సీనియర్ అసిస్టెంట్ సుమన్, సిబ్బంది సుధాకర్, రామనాథం, రామకృష్ణ, కొమురమ్మతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డా. సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# రాహుల్ గాంధీ పోరాట ఫలితమే కేంద్రం దిగిరావడం

**నీట్ వ్యవహారంలో విద్యార్థుల విజయమే : ఎర్రబెల్లి స్వర్ణ**



**హైదరాబాద్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం దిగిరావడం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థి ఉద్యమాలకు, కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటానికి దక్కిన విజయమని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఈ అంశంపై పార్లమెంట్‌లోనూ, ప్రజా వేదికలపైనా కేంద్ర ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూ విద్యార్థులకు అండగా నిలిచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలు, రాహుల్ గాంధీ చేసిన పోరాటం కారణంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని పేర్కొన్నారు. గత 28 రోజులుగా విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని, కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించడంతో కేంద్రం నిర్ణయం మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేసే ఏ ప్రభుత్వమూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేదని పేర్కొన్న ఎర్రబెల్లి స్వర్ణ, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. నిరసనల సందర్భంగా మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని, మృతుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గుర్రం జాషువా 55వ వర్ధంతి సందర్భంగా యాక్ట్ చైర్మన్ ఆళ్ళమూడి ప్రభాకరరావుకు ఘన సన్మానం





**తెనాలి, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

పద్మభూషణ్, కళాప్రపూర్ణ, కవికోకిల గుర్రం జాషువా 55వ వర్ధంతి సందర్భంగా తెనాలిలోని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ (కవిరాజా పార్క్) హాల్‌లో పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి సభ నిర్వహించారు. కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పెద్దీటి యోహాను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా సాహిత్య సేవలను, సామాజిక సమానత్వానికి ఆయన చేసిన కృషిని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా సేవా రంగంలో విశిష్ట సేవలందిస్తూ అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళమూడి ప్రభాకరరావును కళా పరిషత్ ఆధ్వర్యంలో శాలువా, మెమొంటో, పూలమాల, ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించారు. అలాగే గుర్రం జాషువా రచించిన "తెరచాటు" నాటక గ్రంథాన్ని ఆయనకు బహూకరించారు. కార్యక్రమంలో సహజ కవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ ఐనాల మల్లేశ్వరరావు, అభ్యుదయవాది, సీనియర్ అడ్వకేట్ కనపర్తి బెన్హర్, సామాజిక కార్యకర్త, ఆర్టీసీ తెనాలి డిపో జూనియర్ అసిస్టెంట్ డాక్టర్ ఈపూరి ప్రేమకుమార్, కళా పరిషత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని గుర్రం జాషువాకు నివాళులర్పించారు.

## 'ఎక్స్' బయో మార్చిన ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ, జూలై 25 (జై భీమ్ న్యూస్) :**

నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్, కొద్ది గంటల్లోనే తన సామాజిక మాధ్యమం 'ఎక్స్' ఖాతాలోని వివరాలను సవరించారు. ప్రొఫైల్ బయోలో ఉన్న 'కేంద్ర విద్యాశాఖ మంత్రి' హోదాను తొలగించి, ప్రస్తుతం తనను లిలి'సంబల్‌పూర్ ఎంపీ'లిలిగా పేర్కొనగా, బీజేపీ కార్యకర్త అనే వివరాన్ని యథాతథంగా కొనసాగించారు. దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలో అవకతవకలపై విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో తన రాజీనామాకు ఆమోదం లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన ఆయన, ప్రస్తుత పరిస్థితిని దేశ వ్యతిరేక శక్తులు తమ ప్రయోజనాలకు వినియోగించుకోకుండా నిరోధించడానికే తాను పదవి నుంచి తప్పుకున్నట్లు వెల్లడించారు. మే 3న నిర్వహించిన నీట్--యూజీ పరీక్షలో అవకతవకలు జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ వ్యవహారానికి బాధ్యత వహించేందుకు తాను ఎప్పుడూ వెనుకాడనని స్పష్టం చేశారు. పరీక్ష మాఫియా కారణంగా ఏ ప్రతిభావంతుడైన విద్యార్థి నష్టపోకూడదని, ఎవరికీ అన్యాయం జరగకుండా చూడడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా కలిచివేశాయని, ఇది కేవలం వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన అంశం మాత్రమే కాదని ధర్మేంద్ర ప్రధాన్ వివరించారు.

# శనివారం రోజు పరిగిలో ఎన్ ఎస్ యూ ఐ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ఎత్తున విజయోత్సవ ర్యాలీ





**బస్టాండ్ దగ్గర బాణసంచా కాల్చిన యువత**

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఇది కచ్చితంగా విద్యార్థుల విజయమే అని విద్యార్థి సంఘాలు అన్నారు. వారు మాట్లాడుతూ.. గత నాలుగు నెలల క్రితం నీట్ పేపర్ లీకేజీ కావడం విద్యార్థులు ఆందోళన చెందడం పరీక్షలు మళ్ళీ నిర్వహించడం విద్యార్థులు గత నెల రెండు నెలల నుండి ఢిల్లీ సరిహద్దును జంతర్మంతర్ వద్ద భారీ నిరసనలు కార్యక్రమాలు చేస్తా ఉన్నారు. అన్యాయంగా కేంద్ర ప్రభుత్వం పోలీసులతో విద్యార్థులను దారుణంగా కొట్టి లాటిల ద్వారా టైయ్యర్ గ్యాస్ ద్వారా తుపాకుల కాల్పులతో విద్యార్థులను ఎంత భయభ్రాంతులకు గురిచేసిన, వెనకడుగు వేయకుండా గట్టిగా నిలబడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనను తెలుపడం వారి యొక్క విజయమే, నేడు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయడం. దేశవ్యాప్తంగా కూడా నిరుద్యోగ సమస్య లేకుండా ప్రతి ఏడాది కోటి ఉద్యోగాలు విడుదల చేస్తానన్నారు. ఉద్యోగాలు విడుదల చేయకపోగా విడుదల చేసిన ఉద్యోగాల్లో అవకతవకలు పేపర్ లీకేజీలు చేయడం ఇది ముమ్మాటికీ బీజేపీకి పరిపాలన చేత కాకపోవడం, ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేయడం విద్యార్థులు విద్యార్థి సంఘాలు హర్షిస్తున్నారు. ఢిల్లీలో విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా మద్దతు తెలపడంతో ఇంకా దేశవ్యాప్తంగా కూడా ఆందోళనలు పెరగడం బిజెపి ప్రభుత్వం దిగి రావడం మంత్రి రాజీనామా చేయడం జరిగింది. విద్యార్థులు తలుచుకుంటే సాధించదంటూ ఏదీ లేదు పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో గట్టిగా బిజెపి ప్రభుత్వానికి ఇది పెద్ద గుణపాఠంగా మారింది. ఇప్పటికైనా నియంత పోకడలు పోకుండా దేశ యువతను కాపాడే విధంగా విద్యను వ్యాపారం చేయకుండా విద్యారంగానే బలోపేతం చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. విద్య వ్యవస్థ బాగుంటేనే దేశం బాగుంటుందని విద్యార్థి యువజన సంఘం నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సంఘీభావంగా కాంగ్రెస్ పార్టీ మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, పాక్స్ వైస్ చైర్మన్ రాజ పుల్లారెడ్డి పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి మండల పార్టీ అధ్యక్షులు వెంకట రాములు, కౌన్సిలర్ బాదాం శ్రీనివాస్ యూత్ కాంగ్రెస్ నాయకులు రవికాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ పాక్స్ డైరెక్టర్, ఈ కార్యక్రమంలో మిర్జా మిన్హాజ్ (వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి), అబ్బు బేకర్ సిద్ధిక్ షేక్ (ఎన్ ఎస్ యూ ఐ పరిగి టౌన్ అధ్యక్షులు), మొహమ్మద్ సల్మాన్, మొహమ్మద్ ఫిరోజ్, గణేష్, మొహమ్మద్ జిలానీ, నితిన్, మొహమ్మద్ అజీజ్, షోయబ్, సమీర్, మొయిజ్, ఆదిల్ మరియు ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ వివాదం దేశాన్ని కుదిపింది

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిసిన రాజకీయ, విద్యా సంక్షోభం**

**పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసిన పేపర్ లీక్‌లు**

**దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు**


**కేంద్రం కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి)**

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేసిన (నీట్) ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం చివరకు కేంద్ర రాజకీయాల్లో కీలక పరిణామానికి దారితీసింది. తీవ్ర విమర్శలు, విద్యార్థుల నిరసనలు, ప్రతిపక్ష పార్టీల ఒత్తిడి, దేశవ్యాప్తంగా కొనసాగిన ఉద్యమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం దేశ రాజకీయ, విద్యా రంగాల్లో సంచలనంగా మారింది. నీట్ పరీక్ష దేశంలో వైద్య విద్యలో ప్రవేశాలకు అత్యంత కీలకమైన పరీక్షగా పరిగణించబడుతుంది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు అనేక సంవత్సరాల కఠోర శ్రమ, కోచింగ్, ఆర్థిక వ్యయంతో ఈ పరీక్షకు సిద్ధమవుతుంటారు. అలాంటి పరీక్షలో ప్రశ్నపత్రం లీక్ కావడం, నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకోవడం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపింది. అనేక మంది విద్యార్థులు తమ కృషి వృథా అయిందనే ఆవేదన వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు పరీక్షల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తారు. పేపర్ లీక్ వార్తలు వెలుగులోకి వచ్చిన వెంటనే దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్‌తో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, ముంబై, పాట్నా, భోపాల్, లక్నో తదితర నగరాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. "విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు", "పరీక్షల పారదర్శకతను కాపాడాలి", "బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి" అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ వివాదం పార్లమెంట్‌లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ పరీక్షల నిర్వహణలో వైఫల్యాన్ని ఎత్తిచూపాయి. పరీక్షా విధానంలో పారదర్శకత తీసుకురావాలని, బాధ్యులపై




చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశాయి. అధికార పక్షం కూడా పరీక్షా వ్యవస్థలో సంస్కరణలు అవసరమని అంగీకరించినప్పటికీ, వివాదం రోజురోజుకూ ముదిరింది. విద్యార్థుల నిరసనలు, రాజకీయ ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు--2026 ముసాయిదాను విడుదల చేసింది. ఈ బిల్లులో ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షలు, భారీ జరిమానాలు, ప్రత్యేక దర్యాప్తు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా వేగవంతమైన విచారణ, నిర్ణీత గడువులో కేసుల పరిష్కారం వంటి కీలక నిబంధనలను ప్రతిపాదించింది. అంతేకాకుండా పరీక్షా కేంద్రాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడం, డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలను కూడా ప్రకటించింది. అయితే ఈ చర్యలు సరిపోవని భావించిన విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల సంఘాలు, ప్రతిపక్షాలు ఆందోళనలను కొనసాగించాయి. పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కేవలం చట్ట సవరణలు కాకుండా బాధ్యులపై చర్యలు తప్పనిసరని స్పష్టం చేశాయి. చివరకు ఈ పరిణామాల మధ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. మంత్రి రాజీనామా అనంతరం దేశవ్యాప్తంగా భిన్న స్పందనలు వ్యక్తమయ్యాయి. విద్యార్థి సంఘాలు దీనిని తమ ఉద్యమానికి దక్కిన విజయంగా అభివర్ణించాయి. అనేక రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యంలో ప్రజల స్వరం గెలిచిందని పేర్కొన్నాయి. మరోవైపు కొందరు విద్యావేత్తలు మాత్రం ఒక మంత్రి రాజీనామాతో సమస్య ముగిసిపోదని, పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగత మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వివాదం మరోసారి దేశంలోని జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణపై ప్రశ్నలను లేవనెత్తింది. పరీక్షా ప్రశ్నపత్రాల భద్రత, డిజిటల్ వ్యవస్థలు, పరీక్షా కేంద్రాల నిర్వహణ, దర్యాప్తు యంత్రాంగం, బాధ్యతాయుత పరిపాలన వంటి అంశాలపై సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్త విద్యాశాఖ మంత్రిని నియమించడంతో పాటు పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నదానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అలాగే ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడిన వారిపై జరుగుతున్న దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు కూడా కీలకంగా మారాయి. విద్యార్థుల భవిష్యత్తు, దేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడాలంటే రాజకీయాలకు అతీతంగా పరీక్షా విధానంలో సమూల సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రధాన అంశంగా మారింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక ముగింపు కంటే, భారత పరీక్షా వ్యవస్థలో కొత్త మార్పులకు నాంది పలికిన కీలక పరిణామంగా రాజకీయ, విద్యా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. – శ్రీకాంత్ హన్మకొండ.



# విద్యార్థుల విజయమే: సీజేపీ

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సంతోషం వ్యక్తం చేసిన సీజేపీ**

**ప్రధాన డిమాండ్ నెరవేరిందన్న అభిజీత్ దీప్కే**

**జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల సంబరాలు, కొవ్వొత్తుల ర్యాలీ**

**మరో రెండు డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగింపు**

**పోలీసుల చర్యలపై విచారణ, విద్యా సంస్కరణలకు డిమాండ్**

**న్యూఢిల్లీ, జూలై 25 (జై భీమ్ న్యూస్) :**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసినట్లు వచ్చిన వార్తలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) హర్షం వ్యక్తం చేసింది. దీనిని లిలి"విద్యార్థుల విజయం"లిలిగా అభివర్ణిస్తూ శనివారం జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, తమ ప్రధాన డిమాండ్లలో ఒకటి నెరవేరిందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో చేపట్టిన శాంతియుత పోరాటం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చని మరోసారి నిరూపితమైందని, దేశ యువత పోరాటం ఫలించిందని, ఈ విజయం దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ చెందుతుందని అన్నారు. రాజీనామా వార్త వెలువడిన వెంటనే జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు సంబరాలు జరుపుకుని, సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తమ ఉద్యమానికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన సీజేపీ నాయకత్వం, ప్రధాన డిమాండ్ నెరవేరినప్పటికీ మిగిలిన రెండు డిమాండ్లు కూడా అమలయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వెల్లడించింది. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై దాడులకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశ విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీజేపీ స్పష్టం చేసింది.

# దళిత ఎమ్మెల్యేల పట్ల వివక్ష ఆపాలి

**ఇకపై మౌనంగా ఉండం**
**ఎస్సీ ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి..**
**మా నియోజకవర్గాలకు అదనంగా వెయ్యి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి**
**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**హైదరాబాద్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ పార్టీలో దళిత ఎమ్మెల్యేల పట్ల వివక్ష కొనసాగుతోందని, ఇకపై అలాంటి పరిస్థితులను సహించబోమని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఒక్క మందుల సామేల్‌కే కాకుండా రాష్ట్రంలోని దళిత ఎమ్మెల్యేలందరూ ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, దళిత ఎమ్మెల్యేలు మాత్రమే కాకుండా వారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలు కూడా అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపినప్పటికీ, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు, ప్రాధాన్యం లభించడం లేదని అన్నారు. పార్టీలో కొందరు అగ్రకుల నాయకులు దళిత ప్రజాప్రతినిధులను తక్కువగా చూసే ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించిన ఆయన, ఇకపై ఈ పరిస్థితిని సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దళిత ఎమ్మెల్యేల గౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ సమస్యలన్నింటినీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. దళిత ఎమ్మెల్యేల అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించాలని, వారికి తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, అభివృద్ధి పనులకు బిల్లుల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో అన్ని నియోజకవర్గాలను సమానంగా చూడాలని, సామాజిక న్యాయం ఆచరణలో కనిపించాలన్నారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో దళిత నియోజకవర్గాలకు అదనంగా వెయ్యి ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. నిరుపేదలకు గృహాల కల్పనలో దళిత ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సమాన అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని, ఆ సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలో కూడా అమలు కావాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. దళిత ఎమ్మెల్యేల పట్ల వివక్ష కొనసాగితే తమ అభిప్రాయాలను మరింత బలంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, ప్రజల హక్కుల కోసం రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

**న్యాయవ్యవస్థ-పోలీస్ వ్యవస్థల సమన్వయంతో ప్రజలకు సమర్థవంతమైన సేవలందించాలని ఆకాంక్ష**



**హన్మకొండ, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శనివారం హన్మకొండ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేనారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో న్యాయవ్యవస్థ, పోలీసు శాఖల మధ్య సమన్వయం, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో పోలీసుల పాత్ర, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు వంటి అంశాలపై పరస్పర మర్యాదపూర్వకంగా చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పోలీసు సేవలు అందించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మహిళలు, పిల్లల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించడం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేనారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసిన కమిషనర్, న్యాయవ్యవస్థ--పోలీసు శాఖల సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రజల్లో చట్టాలపై విశ్వాసాన్ని పెంపొందించేందుకు రెండు వ్యవస్థలు సమన్వయంతో పనిచేయడం అవసరమని అభిప్రాయపడ్డారు. మర్యాదపూర్వక వాతావరణంలో జరిగిన ఈ భేటీ అనంతరం కమిషనర్ ఎన్. శ్వేత న్యాయమూర్తికి మరోసారి శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజాసేవలో ఆయన మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

**గాంధీ నుంచే తాము శాంతిని నేర్చుకున్నాం**
**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే**

**న్యూఢిల్లీ,జూలై25(జై భీమ్ న్యూస్):**

నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమాల విజయమే: యూత్ కాంగ్రెస్

**ఇక దిగాల్సింది ప్రధాని మోదీయే.. ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు: మాదాసి శ్రీధర్**



**ఆత్మకూర్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఐక్య ఉద్యమాలకు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మద్దతుకు, యూత్ కాంగ్రెస్ నిరంతర పోరాటానికి దక్కిన విజయమని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాలు కేంద్ర ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గేలా చేశాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన వారికి ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటమే గట్టి సమాధానం చెప్పిందని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే ధోరణి, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్యలు, విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం వంటి విధానాలపై దేశ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఆయన విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆ అసంతృప్తికి నిదర్శనమని అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా నిలిచి, వారి సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావించారని చెప్పారు. విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమాలకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించిందన్నారు. విద్యార్థులపై నమోదైన కేసులు, లాఠీచార్జీలు, నిర్బంధాలు ఉద్యమ స్ఫూర్తిని అణచలేకపోయాయని, యువత ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి తమ గళాన్ని వినిపించిందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు పారదర్శకమైన పరీక్షా విధానం, బాధ్యులపై కఠిన చర్యలు, విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నిరుద్యోగ యువతకు న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతర పోరాటం కొనసాగిస్తుందని మాదాసి శ్రీధర్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడే దిశగా యువత మరింత చైతన్యవంతంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్యమంలో పాల్గొన్న యువత, విద్యార్థి సంఘాల నాయకులకు ఆయన అభినందనలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ఎఐతో ఉన్న భయాలు తొలగించాలి

**ఎఐపై ఉన్న అపోహలు తొలగిస్తేనే భవిష్యత్**
**మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు**

**న్యూయార్క్,జూలై25(జై భీమ్ న్యూస్):**

ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐటీ రంగంలో మానవ ఉద్యోగాలను భర్తీ చేస్తుందనే నిరంతర భయాల కారణంగా ప్రజలు ఏఐ రంగంపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే కొన్ని చర్యలు తీసుకోక తప్పదని వ్యాఖ్యానించారు. ఉదాహరణకు ఒక సంస్థ డేటా సెంటర్‌ను నిర్మిస్తున్నట్లయితే.. స్థానిక ప్రజలకు అది ఎంత ఉపయోగకరమో వివరించాలన్నారు. అప్పుడే వారు దాని అవసరాన్ని గుర్తిస్తారన్నారు. ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తున్నారని సత్యనాదెళ్ల అన్నారు. దీంతో రాబోయే ఏఐ యుగం.. మునుపటిలా కాకుండా భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకత కు ఏఐ సాంకేతికత కలిస్తేనే భవిష్యత్ సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఏఐని స్వతంత్ర మేధస్సుగా చూడకూడదని.. మానవ ఆలోచనలను పెంచే, ప్రజల లక్ష్యాల సాధనకు దోహదపడే టూల్‌గా చూడాలన్నారు. ఉద్యోగాల నుంచి కార్మికులను తొలగించి వారి స్థానంలో ఏఐని తీసుకురాకుండా.. మానవ సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించాలని కంపెనీలకు ఆయన సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి ప్రస్తుత వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు. కొత్త ఉద్యోగాలను సృష్టించడానికి.. మంచి వేతనాలు నిర్ణయించడానికి కూడా ఏఐని వినియోగించాలని సూచించారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు వినతి**
**ప్యాలియేటివ్ కేర్ ఆయాలకు 10 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి**
**జీవోలు 1195, 1190, 1187 అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్ర నాయకుల డిమాండ్**



**మహబూబాబాద్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘాల ఐకాస రాష్ట్ర నాయకులు డాక్టర్ కుమార్ నాయక్, బాలాజీ చౌహాన్ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 1195, 1190, 1187లను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ జీవోలు అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,500 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు నాలుగున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 30 శాతం పీఆర్‌సీ బకాయిలు అందడంతో పాటు, ఇప్పటివరకు పీఆర్‌సీ ప్రయోజనం పొందని ఉద్యోగులకు కూడా న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ అంశంపై ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, ప్రభుత్వం జీవోలను అమలు చేయాలని కోర్టు ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు అమలు చేయలేదని, దీంతో ధిక్కార పిటిషన్లు కూడా దాఖలైనట్లు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలను గౌరవించి ప్రభుత్వం వెంటనే జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ప్యాలియేటివ్ కేర్‌లో పనిచేస్తున్న సుమారు 60 మంది ఆయాలకు గత 10 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పిల్లల విద్యా ఫీజులు, ఇంటి అద్దె, రవాణా ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి నెలకొన్నందున, పెండింగ్‌లో ఉన్న పది నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ స్పందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫిజియోథెరపీ విభాగాల అవసరం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఫిజియోథెరపిస్టుల యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక ఫిజియోథెరపీ విభాగాలను ఏర్పాటు చేసి, ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జాతీయ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ చట్టం--2021 ప్రకారం ప్రతి రాష్ట్రంలో స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ కౌన్సిల్ ఏర్పాటు తప్పనిసరి అయినప్పటికీ, తెలంగాణలో ఇప్పటి వరకు ఆ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయకపోవడం, ఛైర్మన్‌ను నియమించకపోవడం వల్ల అలైడ్ హెల్త్‌కేర్ వృత్తి నిపుణులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి, సంబంధిత వృత్తి నిపుణుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాజేశ్వరి, ధరావత్ లక్ష్మి, సంధ్యతో పాటు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు, ఫిజియోథెరపిస్టుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం అక్కసు

**మూడేళ్ల పాటలు వీసాలు నిలిపివేసే బిల్లుకు ప్రతిపాదన**
**సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పెట్టిన రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ**




**న్యూఢిల్లీ,జూలై25(జై భీమ్ న్యూస్):**

హెచ్-1బీ వీసాలపై ట్రంప్ యంత్రాంగం విధిస్తోన్న ఆంక్షలతో సతమతమవుతున్న భారతీయులను.. ఇప్పుడు మరో బిల్లు ఆందోళనకు గురిచేస్తోంది. రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లులో.. కొత్త హెచ్-1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ప్రతిపాదించారు. అలాగే ట్రంప్ యంత్రాంగం విధించిన లక్ష డాలర్ల ఫీజును చట్టబద్ధం చేయాలని పేర్కొన్నారు. అమెరికన్ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్న వీసాలను జారీ చేయకూదని కోరారు. 'ఎండ్ హెచ్-1బీ వీసా యాక్ట్' పేరిట ప్రవేశపెట్టిన బిల్లులో ఈ ప్రతిపాదనలు చేశారు. కొన్ని ప్రత్యేక పోస్టులను నిపుణులైన విదేశీయులతో భర్తీ చేసేందుకు ఈ హెచ్-1బీ ప్రోగ్రామ్‌ను తీసుకువచ్చారు. అంతే గానీ అర్హత ఉండి కష్టపడి పనిచేసే అమెరికన్ల స్థానంలో తక్కువ వేతనాలకు లభ్యమయ్యే విదేశీ శ్రామికులతో భర్తీ చేయడానికి కాదు. నేను తీసుకువచ్చిన బిల్లు హెచ్-1బీ ప్రోగ్రామ్ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు ఉపయోగపడుతుంది. అందులోని లొసుగుల్ని ఉపయోగించుకోకుండా నివారిస్తుందని పేర్కొన్నారు. అందుకోసం మూడేళ్ల పాటు వీసా జారీని నిలిపివేసి, కఠిన నిబంధనలతో మళ్లీ కొత్తగా ఈ ప్రోగ్రామ్‌ను తీసుకురావాలని కోరారు. కొన్ని నెలల క్రితం రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఎలీ క్రేన్ ప్రతినిధుల సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏటా ఇస్తున్న 85,000 వీసాలను తగ్గించాలని.. లాటరీ విధానం కాకుండా అత్యధిక జీతం ఇచ్చే వారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని.. హెచ్-1బీ వీసాదారులు భార్యాపిల్లలను అమెరికాకు తీసుకురావడంపై నిషేధం విధించాలనే ప్రతిపాదనలు ఈ బిల్లులో ఉన్నాయి. అయితే ఇది ఉభయసభల్లో ఆమోదం పొందిన తరవాతనే బిల్లుగా మారనుంది.

# విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోడీ

**కేంద్రం దిగిరాక తప్పని పరిస్థితి**
**మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం**
**కేంద్రం తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు**

**హైదరాబాద్,జులై 25 (జై భీమ్ న్యూస్) :**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీయేతర రాజకీయ పక్షాల పోరాటానికి దక్కిన విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని, వాటి ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను ప్రభుత్వం గౌరవించక తప్పదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన పదవి కాపాడుకోవడానికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. నీట్ పరీక్ష లీక్ జరిగినప్పుడే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకూ వచ్చేదే కాదన్నారు. మూడు నెలల పాటు ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించిన ఆయన.. విద్యార్థులపై పెరిగిన ఒత్తిడి, నిరసనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. యువత తమ దమ్ము ఏంటో నిరూపించారని, వారి పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో పేపర్ లీకులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థులు, యువత పోరాటానికి దక్కిన విజయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈ పరిణామంతో బీజేపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు. విద్యార్థుల డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రస్తుత ప్రభుత్వాలతో పాటు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలకు కూడా ఒక కనువిప్పుగా మారాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**నీట్ పేపర్ లీక్ వివాదంతో పదవికి వీడ్కోలు**
**విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కీలక నిర్ణయం**
**ప్రధాని మోదీకి రాజీనామా లేఖ పంపిన మంత్రి**
**విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి**
**కేంద్రం-సీజేపీ చర్చలకు ముందే కీలక పరిణామం**

**ఢిల్లీ, జూలై 25 (జై భీమ్ న్యూస్) :**

జాతీయ ప్రవేశ పరీక్షలు (నీట్) ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. శనివారం ప్రధాని నరేంద్ర మోదీకి రాజీనామా లేఖ పంపిన ఆయన, యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం--సీజేపీ మధ్య జరగనున్న చర్చలకు ముందే ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుత పరిస్థితులను దేశవ్యతిరేక శక్తులు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోకుండా చూడాల్సిన అవసరం ఉందని, ఏ విద్యార్థి భవిష్యత్తు కూడా న్యాయపరమైన చిక్కుల్లో పడకూడదని, విద్యార్థులు తమ సమయాన్ని చదువు, భవిష్యత్ నిర్మాణంపై కేంద్రీకరించాలని ఆకాంక్షిస్తూ రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై తొలి రోజు నుంచే తాను పూర్తి బాధ్యత వహించానని, అయితే బాధ్యతాయుత పదవుల్లో ఉన్న కొందరు వ్యక్తులు విద్యార్థులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని వ్యాఖ్యానించారు. 56 ఏళ్ల ధర్మేంద్ర ప్రధాన్ జూలై 2021 నుంచి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించగా, అంతకుముందు పెట్రోలియం, సహజవాయువు, నైపుణ్యాభివృద్ధి శాఖలను నిర్వహించారు. ఒడిశాకు చెందిన ఆయన గతంలో ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా పనిచేయగా, జూన్ 2024లో మోదీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు.

## ధర్మేంద్ర రాజీనామాపై వాంగ్‌చుక్ హర్షం

న్యూఢిల్లీ,జులై 25 (జై భీమ్ న్యూస్): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయని పేర్కొన్నారు. జెన్-జీ, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శనివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది శాంతి, ఓర్పు, నిరంతర పట్టుదలల విజయం. దేశంలోని సీజేపీ, జెన్ జీ యువతకు అభినందనలు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు బాధ్యతాయుతమైన సమాధానం కోరాం. ఇకపై సంస్కరణల వైపు సాగుదాం' అని రాసుకొచ్చారు.

# జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

**కేంద్రమంత్రులతో సిజెపి ప్రతిధుల చర్చలు ఫలప్రదం**
**విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం**
**భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ**
**ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్**

**న్యూఢిల్లీ,జులై 25 (జై భీమ్ న్యూస్) :**

జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిమారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం దిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. దిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు. సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు. తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు. అవి సాధించేవరకూ ముందుకు సాగుతూనే ఉంటామని అన్నారు.

# డిఎస్సీపై వైసిపి పదేపదే అసత్య ఆరోపణలు

**మండిపడ్డ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**
**ఆర్టీసిని ప్రైవేట్ పరం చేయబోమని హామీ**

**విశాఖపట్నం,జులై 25 (జై భీమ్ న్యూస్):**

ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని మంత్రి మండిపడ్డారు. వైసీపీకి ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించే అలవాటు లేదని విమర్శించారు. తాడేపల్లిలో జగన్ ఇంటి సమీపంలోనే ఉండి లోకేశ్ డీఎస్సీపై సవాల్ విసిరారని, దానిపై స్పందించేందుకు జగన్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా చట్టబద్ధంగా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా వివరాలు ఇచ్చినప్పటికీ వైసీపీ రాజకీయ దివాళాకోరుతనంతో విమర్శలు చేస్తోందని మంత్రి మండిపల్లి అన్నారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వైసీపీ లక్ష్యమని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలు చేపట్టలేని వారు రాజకీయ రంగు పులిమి విమర్శలు చేయడం సరికాదని, ప్రజా సమస్యలపై చర్చించకుండా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉన్నంతవరకు ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటుపరం చేయబోమని.. అపోహలకు తావు లేదని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. విశాఖలో సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను మంత్రి ప్రారంభించారు. రవాణా రంగంలో పీఎం ఈ-బస్ సేవతో నూతనశకం మొదలైందన్నారు. మరో రెండు నెలల్లో తొలి దశలో 750 ఈ- బస్సులు రానున్నాయని, అందులో విశాఖకు 100 బస్సులు కేటాయించనున్నట్టు చెప్పారు. ప్రస్తుత బస్సులతో పాటు, కొత్త ఈ-బస్సులతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. పర్యావరణ హిత, ఆధునిక ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# హౌజింగ్ కార్పోరేషన్ కీలక నిర్ణయం

**మూడు రోజుల గ్రాస్ సాలరీ వసూలు నిలిపివేత**

**అమరావతి,జులై 25 (జై భీమ్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కీలక నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల కోసం మూడు రోజుల గ్రాస్ శాలరీని వసూలు చేయాలంటూ జారీ చేసిన ఉత్తర్వులను సంస్థ యాజమాన్యం పూర్తిగా రద్దు చేసింది. ఈ మేరకు జులై 16న జారీ చేసిన మెమోను రద్దు చేస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి. అరుణ్ బాబు తాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల ముందస్తు అనుమతి లేకుండానే జీతం కోత ప్రతిపాదించడం సరైంది కాదని గుర్తించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెమోలో పేర్కొన్నారు. అలాగే, మూడు రోజుల జీతాన్ని ఉద్యోగుల సంక్షేమ నిధికి జమ చేయాలన్న ఆదేశాలు పూర్తిగా రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. జీతం కోతకు సంబంధించిన అన్ని ఉత్తర్వులు తక్షణమే అమలు కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారులకు ఎండీ ఆదేశాలు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఎండీ పి. అరుణ్ బాబు ఆదేశాలు జారీ చేశారు.

## ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మారొచ్చు

న్యూఢిల్లీ,జూలై25(జై భీమ్ న్యూస్):విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మరో శాఖకు మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్న వార్తలు ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించబోదన్న వార్తల నడుమ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సహా మూడు డిమాండ్స్‌ను విద్యార్థులు ప్రభుత్వం ముందు పెట్టారని అన్నారు. వీటి విషయంలో వారు రాజీపడబోరని అభిప్రాయపడ్డారు. 'అసమర్థ, అవినీతి మరక అంటిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది మొదటి డిమాండ్. అయితే, ఆయన శాఖ మార్చే అంశం ప్రధాని కేబినెట్‌లో చర్చకు వచ్చినట్టు టాక్ వినిపిస్తోంది. భారతీయ విద్యార్థులు దీన్ని అస్సలు ఆమోదించరు.

# సామాన్యుడిలా ప్రజల మధ్యే ఉంటా

**సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం**
**వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుందాం**
**ఆస్పరిలో సంజీవిని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు**





**కర్నూలు,జులై 25 (జై భీమ్ న్యూస్):**

తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యలోనే ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటించి 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించిన సీఎం.. వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ 'ఏఐ డాక్టర్' సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొ÷ల్‌ను డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. అలాగే భూ హక్కులకు భద్రత కల్పించేందుకు 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని విమర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.



# దివ్యాంగుల సేవే విశ్వమానవ సేవ : డాక్టర్ అనితా రెడ్డి





### వికాస్ మనోవికాస మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

**హనుమకొండ, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

దివ్యాంగుల సేవ చేయడం అంటే విశ్వమానవ సేవ చేసినట్టేనని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని వికాస్ మనోవికాస మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించిన ఆమె, అక్కడి విద్యార్థుల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకుని వారితో ఆప్యాయంగా సమయం గడిపారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించాలంటే దివ్యాంగులకు నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య ద్వారానే వారి ఆత్మవిశ్వాసం పెరిగి స్వావలంబన సాధించగలరని పేర్కొన్నారు. మానసిక దివ్యాంగుల పట్ల ప్రేమ, సహనం, ఆప్యాయతతో వ్యవహరిస్తూ వారికి అవసరమైన విద్య, జీవన నైపుణ్యాలను నేర్పించాలని ఆమె సూచించారు. దివ్యాంగులు కూడా ఇతరుల మాదిరిగానే విద్యా హక్కు, వారసత్వ హక్కు, సమాన అవకాశాల హక్కు సహా రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులకు అర్హులేనని స్పష్టం చేశారు. వారి హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దివ్యాంగుల సంక్షేమ సంస్థలను నిర్వహించే నిర్వాహకులు జువెనైల్ జస్టిస్ (జె.జె.) చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులతోనే సంస్థలను నిర్వహించాలని ఆమె సూచించారు. సేవా సంస్థలు కేవలం ఆశ్రయం కల్పించడమే కాకుండా విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఒక విద్యార్థి విద్యకు సహకరించడం అంటే ఒక కుటుంబ భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమేనని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన ప్రతి ఒక్కరూ దివ్యాంగుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్రతి చిన్నారి చదువుకొని ఆత్మగౌరవంతో జీవించే స్థాయికి ఎదగాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస్ మనోవికాస ఆశ్రమ నిర్వాహకురాలు విశాలి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, అనురాగ్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : ఏఐవైఎఫ్

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో బాధ్యత ముగియదు
### విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలి
### కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించిన ఏఐవైఎఫ్ నాయకులు






**హైదరాబాద్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని, నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినా, అంతటితో బాధ్యత ముగియదని, ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరింది. ఈ డిమాండ్లతో శనివారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శవయాత్ర నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ, దేశంలోని లక్షలాది మంది విద్యార్థులు పరీక్షల అక్రమాల వల్ల తీవ్ర ఆందోళన, మానసిక వేదనకు గురవుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాల్సిందిపోయి రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. దేశ ప్రధానిగా యువత, విద్యార్థుల ఆందోళనలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రధాని నరేంద్ర మోదీపై ఉందని, నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాలు, నిరుద్యోగం, ఖాళీ ఉద్యోగాల భర్తీ, విద్యారంగంలో పెరుగుతున్న అవినీతి వంటి కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర విద్యాశాఖ నైతిక బాధ్యత వహించాలని, రాజీనామాతోనే సమస్య ముగిసినట్లు భావించరాదన్నారు. పరీక్షల వ్యవస్థపై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను తొలగించి, పారదర్శకమైన పరీక్షల నిర్వహణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. నీట్ సహా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో వరుసగా చోటుచేసుకుంటున్న అక్రమాలు లక్షలాది మంది విద్యార్థుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపాయని, దీనివల్ల పరీక్షల విశ్వసనీయత దెబ్బతిందని పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షల నిర్వహణలో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని, దేశ యువత భవిష్యత్తును కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్, మధు, వెంకటేష్, మధుకర్, అలీ, రాహుల్, కిరణ్, ప్రదీప్, రమేష్, సాయి, భరత్, ధీరజ్తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట నూతన సీఐ సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన హర్ష యాదవ్

### శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ




**కూకట్‌పల్లి, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన నిగిడాల సురేష్ ను బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) నాయకుడు హర్ష యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం వెంకటేశ్వరనగర్‌కు చెందిన బీజేపీ యువమోర్చా నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఐ సురేష్‌ను కలిసిన హర్ష యాదవ్, శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనకు నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హర్ష యాదవ్ మాట్లాడుతూ, వెంకటేశ్వరనగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, నేరాల నియంత్రణలో పోలీసు శాఖకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ప్రజలకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడంలో పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సీఐ నిగిడాల సురేష్ కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టబద్ధమైన, పారదర్శకమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తామని, ప్రజల సహకారంతో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు భాస్కర్ గౌడ్, సీనియర్ నాయకుడు సుధాకర్, ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడు రాజు, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, మహిళా మోర్చా నాయకురాలు అనిత, మునిషా, అభిరామ్తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధర్మేంద్ర రాజీనామా..యువత సాధించిన విజయం: హరీష్

**హైదరాబాద్,జులై 25 (జై భీమ్ న్యూస్):**

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీజీపీతోపాటు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తలొగ్గుతూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజీపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పందించారు. తాజా సందర్భాన్ని దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయంగా హరీశ్ రావు అభివర్ణించారు.. సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పు నిజంగానే కనిపిస్తోంది. విద్యార్థులందరికీ అభినందనలు.. అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ గొప్ప దేశంలోని విద్యార్థులు, యువత, 'జెన్-జెడ్' టీంకు అభినందనలు.

## బీరన్న స్వామి బోనాల్లో బోనం ఎత్తిన మంత్రి కొండా సురేఖ

### పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు.. నగర ప్రజలకు బోనాల శుభాకాంక్షలు

**వరంగల్, 25 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**



రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం వరంగల్ నగరంలోని ఓల్డ్ సిటీ ప్రాంతంలో నిర్వహించిన బీరన్న స్వామి బోనాల మహోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బోనం ఎత్తుకుని పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనేందుకు మంత్రి కొండా సురేఖ ఓల్డ్ సిటీకి చేరుకోగా స్థానిక ప్రజలు, మహిళలు, యువత, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. జై కొండా సురేఖ నినాదాలతో ప్రాంతమంతా మార్మోగింది. మంత్రి రాక సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆమెకు పూలమాలలు వేసి సన్మానించారు. మహిళలు, అభిమానులు మంత్రితో సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి కొండా సురేఖ సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకుని ఆలయానికి చేరుకొని పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. బోనాల పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, ఈ పండుగ సామాజిక ఐక్యతను, భక్తి భావాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. వరంగల్ నగర ప్రజలందరికీ పోచమ్మ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి, అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆనందం నెలకొనాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## విద్యార్థులే నిజమైన దేశభక్తులు

### ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్
### రాహుల్, ప్రియాంకల హర్షం

న్యూఢిల్లీ,జులై 25 (జై భీమ్ న్యూస్): కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిణామం విద్యా రంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

## సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న నారా రోహిత్

కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్–త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజినీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## సక్సెస్ టాక్‌లో చెన్నై లవ్ స్టోరీ

టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన ప్రేమకథా చిత్రాల్లో 'చెన్నై లవ్ స్టోరీ' ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, నటి శ్రీ గౌరీ ప్రియా జంటగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు రవి నంబూరి దర్శకత్వం వహించారు. జాతీయ అవార్డు గ్రహీత సాయి రాజేష్ అందించిన కథతో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పరుచుకోగా, ప్రీమియర్ షోల నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను అందుకుంది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం నటన, శ్రీ గౌరీ ప్రియా సహజమైన అభినయం, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో విడుదలైన మొదటి రోజే 1.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం విశేషంగా మారింది. విడుదల రోజునే ఇంత భారీ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం సినిమా క్రేజ్‌ను ప్రతిబింబిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, నేపథ్య సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భావోద్వేగ సన్నివేశాలను మరింత బలంగా నిలబెట్టడంలో ఆయన సంగీతం కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. తొలి రోజు స్పందనను బట్టి చూస్తే, 'చెన్నై లవ్ స్టోరీ' కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చెన్నై లవ్ స్టోరీ' చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్ లో సిబ్బంది మాటలు హైలైట్‌గా నిలిచాయి. హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ, నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, ఎస్‌కేఎన్ తమ అనుభవాలను పంచుకుంటూ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ.. తన జీవితంలో ఇది ఎంతో ప్రత్యేకమైన విజయమని చెప్పారు. సినిమా విడుదలైనప్పటి నుంచి తన ఫోన్ నిరంతరం మోగుతూనే ఉందని, చాలామంది మీ అమ్మ ఉండి ఉంటే చాలా సంతోషించేదని చెబుతున్నారని వెల్లడించారు. అయితే తన అమ్మ ఎక్కడ ఉన్నా తన విజయాన్ని చూస్తూనే ఉంటుందని తాను నమ్ముతున్నానని ఆమె ఎమోషన్ అయ్యారు. ఒక తెలుగు అమ్మాయిగా కంటెంట్ ఉన్న పాత్రలో నటించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు.నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ.. సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రాణం పోశాయని చెప్పారు. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం కూడా చిత్రానికి మరో బలమైందన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల మహిళలు సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారని వెల్లడించారు. గౌరీ ప్రియ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించిందని, అందుకే ఇప్పుడు ఆమెకు అంతటి ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. హీరో కిరణ్ అబ్బవరాన్ని నిజమైన నిర్మాతల హీరోగా అభివర్ణిస్తూ, షూటింగ్ విషయంలో ఎప్పుడూ సహకరించారని వెల్లడించారు.

## మెగా 158లో డాక్టర్ భద్రం కీలక రోల్

### చిరును కలిసి కృతజ్ఞతలు తెలిపిన సోము వీర్రాజు



మెగాస్టార్ చిరంజీవి కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 లో ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ భద్రంకు కీలక పాత్ర దక్కడం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్వయంగా చిరంజీవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.డాక్టర్ భద్రం తన అల్లుడు కావడంతో, ఆయనకు ఇలాంటి మంచి అవకాశం కల్పించినందుకు చిరంజీవికి వ్యక్తిగతంగా ధన్యవాదాలు తెలిపినట్లు సోము వీర్రాజు వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు, వివరాలను సోషల్ మీడియా ద్వారా పంచుకోవడంతో అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, కొత్త నటీనటులకు అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. కళాకారులను ప్రోత్సహించే ఆయన విశాల హృదయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఇదిలా ఉంటే, 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి?బాబీ కాంబినేషన్‌లో వస్తున్న మెగా158 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది.ఈ చిత్రంలో డాక్టర్ భద్రంకు కథలో ప్రాధాన్యం ఉన్న పాత్ర లభించినట్లు సమాచారం. కమెడియన్‌గా ఇప్పటికే మంచి గుర్తింపు సంపాదించిన భద్రం, మెగాస్టార్‌తో కలిసి నటించే అవకాశం తన కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. ముఖ్యంగా 'ప్రతి రోజూ పండగే' చిత్రంలో తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న డాక్టర్ భద్రం, ఇప్పుడు చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకోనుండటంతో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మెగా158 లో చిరంజీవి మరోసారి పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో కనిపించనున్నారని, దర్శకుడు బాబీ తనదైన శైలిలో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

# అర్థవంతమైన పాత్రలుంటేనే చేస్తా: నిధి అగర్వాల్



సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్టులు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్–2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.

# హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ'

### ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని ఇన్‌స్టాలో పోస్ట్




నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళు_ందని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్–కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది.

ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా.ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం అన్నారు. యశ్ మాట్లాడుతూ.. 'ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద'ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.